నామీదేనర్రోయ్!

భమిడిపాటి కామేశ్వరరావుగారు, B. A.

అనగనగా ఓఊరు (అంతమాత్రాన్ని ఇది పిట్టకథా కాదు, బాతుకథా కాదు!) ఆ ఊళ్లో ఓయిల్లుంది. మరెక్కడా ఉండడానికి వీల్లేక, లోగడ చాలా ఊళ్లకి పేరు పోయినట్టే ఆఊరికిగుడా పోవడంచేతనున్నూ, రాబోయే జనాభాలెక్కల సందర్భాలలాంటి వాట్లవల్ల ఇంటినెంబర్లు మారుగుడు కావడంచేతనున్నూ, బోలెడు పాత రికార్డు దులిపితే గాని ఆ ఊరి యొక్క వెనకటిపేరు తేలదు; బోలెడు ఇతర ఒడిసుట్లు పడితేగాని ఆయిల్లున్న జాగాయొక్క నయినం తేలదు. అందుకని తబిసీళ్లు గురించి నన్ను ఆట్టే రొకాయించక ఎందుకన్నానో అన్నాను, ఇల్లాపోనీండి ఈ తభాకి. ఆయింటి యజమాని ఒకాయనే అనికొందరూ, ఇంట్లో ఉండేజనం యావద్విశిష్టం యజమాన్లే అని మరికొందరూ పట్టింపులు పోయేవారు. పోనీ మనం ఏదోకాడికి రాజీకి దిగి ఒకాయనే అని ఒప్పుకుందాం. ఆయనకేనా ఏదో సంజ్ఞ ఉంటే తప్ప వ్యవహరించడం కష్టం గనక, ఆయన్ని "సుభర్త" అందాం. ఇంటావిడగార్ని అప్పుడు సుభార్య అనిన్నీ, వారి కుమారుణ్ణి "సుపుత్రుడు" అనిన్నీ పిలవచ్చు. ఇంటివారంతా కుడా అఖండజ్ఞానులైనప్పుడు, పేర్లు మంచిగా ఉండడంలో చెడుగుఏమీ లేదు. సుభర్తగారి తల్లి ఉంది. ఆవిణ్ణి—వ్యాకరణంసిఖాకోసిరిగాని "సుబామ్మ" అంటే తప్ప సుపుత్రుడు కొంప పీకేస్తాడు.

ఒకనాడు, (ఎప్పుడూ-అంటే, వెనక. అంతకంటే అడగద్దు: మనివి చేశాగా!) పొద్దుటివేళ ఆయింటికి ఉన్న ఒకానొక సావిడిలాంటి మెల్లాలోకి ఒక ముసీలిస్వాములారు వెల్లి కుర్చీమీద కూర్చుని, మోచేతులు కుర్చీచేతులికి ఆక్కించి అరిచేతుల్లో గడ్డం ఆనుకుని, కళ్లు మూసుగుని ధ్యానం దాటిపోయి సమాధిలోపడిపోయాడు. సుభర్త యింటో లేడు. అది అతడు కాఫీకి వెళ్లే టైము. అతడు సకృత్తుగా ఇంటో కాఫీపుచ్చుగున్నా, విధిగా బయట కతికితీరతాడు. అతని మహిమవల్ల అతనికి ప్రతీ కాఫీహొటల్లోనూ కాతాయే. ఎదేనా పాతకాఫీహొటల్లో తను ఇవ్వదేలిన బాకీమొత్తం బాగా ముదరబారినప్పుడు, ఆయన ఆశ్రేణికి వెళ్లడం మానెయ్యవలసిన అవసరం వస్తూండబట్టి, ప్రతీకొత్తకాఫీహొటల్లోనూ వారిదే. శ్రీసుపుత్రుడు ఇల్లటపల్లుడు. అతని అత్తారి కుటుంబంలో ఎవరికో మందిప్పించుగోడానికి వారంతా స్వగ్రామం నించి పట్నంవెళుతూ అతణ్ణి విడిచిపెట్టలేక కూడగట్టుకెళ్లడంవల్ల అతడు ప్రస్తుతం పట్నంలో ఉన్నాడు. సుబామ్మగారు తనకొడుకుత్తో గాని, కోడలిత్తో గాని కాలయాపన కోసం మాటాతిట్టూ ఆడుకుంటూ మహాధ్వాయంగా

ఉపన్యాసం ఉరిమేటప్పుడు గాని కనిపించదు. మొత్తంమీద అప్పుడు ఇంట్లో సుభార్య ఒకర్తే ఉంటూ. కొంతసేపటికి ఆవిడ మెల్లా లోకివచ్చి ఒకగ్లాసూ, పప్పుగిన్నీ, చప్పుడు కాకుండా స్వాములారిదగ్గిర పెట్టి లోపలికి వెళ్లింది. స్వాములారు, చుట్టుపక్కల అయ్యే అలికిడికుడా చెవిని పట్టని యోగంలో ఉంటూన్నప్పటికీ, తన దివ్యజ్ఞానమహిమవల్ల, కాఫీ పరికరాలు తన సాన్నిధ్యానికి అరుగు తెంచడం పోల్చాడు. తక్షణమే కళ్లువిప్పి, వేళ్ల సంధులు బెట్టించి, ఆవలించి చిటికేసి, గొంతుక బాగుపడే నిమిత్తం దీర్ఘంగా సకిలించి, గుటకేసి, 'నారాయణ' అనుకొని, ఆయన గ్లాసులో ఉన్న పాలుపోసి ఆ పప్పుగిన్నెలో ఆయొక్క క్షీరకషాయసమ్మేళన మహోత్సవవైభవం చేతులారా జరుపుతూ, కళ్లారా చూస్తూన్నాడు. నవనవోదయం దాలుస్తూ, సకలకశ్మలహారమై ఒప్పేటటువంటి ఏతత్కాఫీద్రావకగంధం వారి నాసికాగ్రాన్ని డీక్కొనేసరికి, వారికినోరూరి, నాలికజలడి, వాగ్ధారప్రవహించేటంత పనీ జరిగింది. కాని సుభార్యగారు క్షణానికోమాటు ఊహూ ఎగమీలుస్తూండడం, నిరంతరం ఊహూ చీత్తూండడంకుడా స్వాములారికి ఇంట్లోంచి వినిపిస్తున్నాయేమో, ఇంతా ముస్తాబుచేసుకుని తయారైన వారియొక్క లెక్చరుదేవి వేషం తీసేసి వెనక్కి వెనక్కి అణగారడం మొదలెట్టింది. అయినాసరే, ఆవిడదుఃఖానికి కారణం ఏమిటో గమనించితీరాలనేబుద్ధి ఆయన్ని వదలకుండా పట్టుకోడంవల్ల, ఆయన, తనికి కావలిసిన పంచదార పక్కనే ఉన్నట్టు చూసీకుడా, అడిగీ అడగనట్టు—"అమ్మా! కాస్త పంచదార!" అని "ఒహో, ఇక్కడ పెట్టేశారా! మరి తేనక్కర్లేదు, తల్లీ!" అన్నాడు (మహా అక్కడికి, తనుకేకేసిన దరిమిలానే అది తనకంట పడ్డట్టు!) ఇల్లాంటి అర్థకుసి పరామర్శ తనికి నచ్చకగావును, సుభార్య తన మూగనోంలేనే ఉండిపోయింది. దాంతోటి స్వాములారు తప్పకుండా ఏదో కమామీషు ఉందనుకుని, ఒక చిన్న 'తనలో' (అనగా స్వగతం) ప్రారంభించారు: "క్షీరం బ్రహ్మ, చక్కెర ప్రకృతి, కషాయం జీవుడు. కాఫీద్రావకం స్వయంగా సృజన గావించుకునే భక్తకోటికి ఆయొక్క ప్రకృతి జీవబ్రహ్మైక్యవిషయబోధ ప్రత్యక్షంగా సిద్ధిస్తుందిగదా. తిన్నగాచూస్తే అంతా తత్వమే. అదే నీవు" అని.

ఈ వాక్యాలతోటి, సుభార్య సావిడి తలుపు దగ్గిరికొచ్చి, "నాయనా, ఒక్కరవ్వ వడ్డించమన్నారాండి?" అని కనుక్కుంది.

స్వా.—ఉన్నదమ్మా. మరి అవసరం లేదు. అయితే అమ్మా, తమరు తత్వంవింటూంటారుగదా, దుఃఖంలో ఉన్నారే! సుఖానికి గర్వించరాదనీ, దుఃఖానికి ఏడవకూడదనీ, నిన్నటి ప్రసంగంలోనేగా అయ్యగారూ నేనూ ముచ్చటించాం! ద్వంద్వాలయెడ సమభావం ఉండద్దూ, తల్లీ!

సుభా—నిజమేనండి. నేనూ విన్నా. కాని, స్వంత వ్యాపారం వచ్చినప్పుడు తత్వం హూష్ కాకీ అవుతుంది.

స్వా—అయ్యగారు వీథులో కెళ్ళి ఎంత సేపైంది ?

సుభా—ఇప్పు డిప్పుడే. ఆయన వెళ్లిన అరగంటకి మీరొచ్చారు. మొహం కడుక్కుం టూనే వారు నన్ను కాఫీ కాచమన్నారు. నాకు చెయ్యి ఊరుకోక, చేతులో పని చేసే సుగుని కాస్తానండీ అన్నాను. అంటే ఆయన, 'పోన్లే వద్దు, కాఫీహోటేలికి వెళ్లి పుచ్చు గుంటాలే, స్వాములారు వస్తేమాత్రం కాచు' అని నాతో చెప్పేసేసేసి, చక్కా పోయారు. ఇక రావాలి.

స్వా—వారేమన్నా ఆగ్రహం దాల్చి వెళ్లడంవల్లగానీ తమరు చింతిల్లటం లేదుకద!

సుభా—కాదండి. మావాడు పట్టంనించి ఉత్తరం రాల్చాడు. వారూ బయటికి వెళ్ల గానే వచ్చింది.

సాం—ఏం? అంతా క్షేమమేకదా?

సుభా—మీదయవల్ల.

స్వా—ధననష్టం ఏమన్నా వచ్చిందా?

సుభా—అల్లాంటి దిప్పుడు స్మరించడానికే సీలు లేదండి.

స్వా—మరేమిటమ్మా! ఏముంది ఉత్త రంలో? అబ్బాయిపరీక్ష పేలిపోయిందా? మీ దావా పరాయిపక్షం అయిందా?

సుభా—అవేవీ కాదండి! పొరుగింటా రబ్బాయిచేత ఉత్తరం చదివించాను.

స్వా—చెప్పవమ్మా, తల్లీ!

సుభా—దేశదేశాలా మాకున్న కీర్తి నాశనం అయిపోయిందిటండీ, బాబుగారూ! మాయింటివాటాలో అద్దెకి తగులడ్డ చచ్చి నాడి వల్లేనండీ నాయనా! (అని బారుమని కుసిళ్లుతుంది)

స్వా—అన్ని దేశాల్లోనూ ఏకకాల మందే పోయిందా? ఉండు, ఉండవమ్మా. తమాయించు. ఎదీ, ఆ ఉత్తరం!

సుభా—(లోపలికెళ్లి తెచ్చి), ఇదుగోనండి.

స్వా—బాబుగా రొచ్చి చదివేస్తే బా గుండును, నాకు ఆనదు. అరుగో! చిరంజీవ! రండి!

అనేసరికి, సుభర్త, అప్పుడే కొండలు పిండికొట్టి దండయాత్రనించి వచ్చే ఠీవితో ఇంటికొచ్చాడు. స్వాములారు ఉత్తరం ఆయన చేతి కిచ్చాడు. మెల్లాలో ఉన్న మరోకుర్చీ మీద సుభర్త కూలబడి ఉత్తరం చదువుకు న్నాడు. చదువుకుని, కుర్చీలో వెనక్కి ఒరిగి, కళ్లుమూసుగుని,

సుభ—స్వామీ! ఓటి చెప్తాను వినండి. ఇవి న్యాయానికి రోజులు కావండి.

స్వా—కావు, నాయ్నా! బడితె బాజాకి రోజులు!

సుభ—నేను ఓగొప్పపొరపాటు చేశాను.

స్వా—(ఏదో తెలియక) చిత్తం. అల్లాగే మరి! పొరపాటా, పొరపాటున్నరా? ఏమిటండి?

సుభ—నాయింట్లోవాటా ఓడికి అద్దె కిచ్చాను. ఆరేళ్లనించి వాడు లుచ్ఛా అని కని పెట్టలేకపోయాను. మావాడు, దెబ్బతో గ్రహించాడు.

స్వా—ఎవడా అద్దెవాడు?

సుభ—ఉన్నాడులెండి, మీ రెరుగరు. విషధరం!

స్వా—ఏంజేశా డిప్పుడు?

సుభ—నన్నూ, నావాళ్లనిన్నీ పత్రికలో నున్నూ, ఏకేసీనిన్నీ, దేశదేశాలానున్నూ, నాకీర్తి డాగుచేశాడు.

స్వా—మీ జాతకప్రభావంబట్టి మీకు దేశదేశాలా కీర్తి ఉండడంలో అబ్బరం లేదు. కాని, ఎప్పుడూ మీరు నాతో చెప్పనే లేదే ఆమాటా! ఆ ఉత్తరంలో ఇదేనా మీవాడు రాసింది? చదవండి.

సుభ—(చదువుతాడు) "నాన్నగారికి.- అంతాక్షేమం. మనింటో ఉన్న విషధరం మంచివాడని భ్రమించకండి. అతడు పయో ముఖవ్యాఘ్రము.

స్వా—ఇక్కడ రెండు పాతసమాస భాగాలకి వివాహం జరిగినట్టుంది. కానీండి.

సుభ— (చదువును) నాడు తొమ్మిది నెలలకిందట మనికి జరిగిన ఘర్షణ యావత్తూ ఫలానాపత్రికలో రాసేసి, దేశదేశాలా మనకున్న కీర్తి వాడు నాశనం చేశాడు. ఇంకా నయమే. కొన్నికొన్ని లోగుట్టు సంగతులు ఎక్కించాడు కాడు, మరీ చిక్కుగా ఉండేది. ఈపాటి ఆవ్యక్తిని ఇంటోంచి గెంటెయ్యండి. బెంగపెట్టుకోకండి. తగిన సమాధానం నేను రాస్తాను."

స్వా—ఆపత్రిక ఏమిటో, అసలుఆసంగతి ఏమిటో, మీపేరెట్టి ఉందో లేదో, ప్రపంచ కపురీతో చూసుగోవద్దూ నాయ్నా!

సుభ—ఇంకా సంశయం ఎందుకయ్యా, మావాడు రాసింతరవాతా? మావాడిసూక్ష్మ బుద్ధి మీరెరుగరు. (సుభార్యకేసి తిరిగి) ఒసే, మనకీర్తి నాశనం అయిపోయిందిటే! మనకీర్తి ఉన్న ప్రతిమూలకీ వెళ్లి వాడు మన్ని యాగీ పెడుతున్నాడుటే! (అని వాపోతాడు.)

సుభా—భడవా చత్రం అండీ, భడవా చత్రం! ఆరేళ్లనించీ కళ్లు పొరగమ్మి కానలేక పోయాం.

స్వా—ఆపత్రిక ఓసారితెండి, నాయనా!

సుభ త్తకుర్చీమీంచి చివాల్నలేచి, వీధు లోకి ఒక్క గంతేశాడు. ఆమట్టున అతడు వీధులో ఈమూలనుంచి ఆమూలకి ఉప్పట్లాట లోకి మల్లే గాల్నికవ్వించి, కనపడ్డ ప్రతీవాణ్ణీ జబ్బట్టుగుని ఆపి, (స్త్రీలమీద ఆయన చెయ్యి చేసుగోలేదుట, అందువల్ల ఆయన కొందరి కంటె ధీరుడే!) నిలేసి:

సుభ—విన్నారా?

ప్రతీవాడు—లేదండి.

సుభ—ఛీ! ఇంకా వినకపోడం ఏమిటి, మీా మొహం!

ప్ర—రామరామ! నాకు బొత్తిగా తెలియదండి.

సుభ—తెలియక పోడం ఏమిటి! మా యింటోనున్నా, అద్దెకున్న లుచ్ఛా, మా మీాదరాసేసి, దేశదేశాల్లోనున్నా మా కీర్తి తుడిచేశాడు.

ప్ర—ఎక్కడండీ, రాస్తా?

సుభ—ఫలానా పత్రికలో, తెలిసిందా?

ప్ర—సరేలెండి. తెలిసింది. చదువుతాం, జబ్బ వొదలిపెట్టండి.

అన్నతరవాతే వాళ్లని విడుదలచేస్తూ, ఈరీతిగా కొంతకాలం స్వవిషయప్రచారం ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రచారం చేసుగుని, అక్కణ్ణించి ఫలానాపత్రికలుండే రెండుమూడు చోట్లకి ఎగడి ప్రయత్నించినమీాదట అవిప్రతీ చోటా నిండుకోడం విని, మళ్లీ హాలోలక్ష్మణా అంటూ అద్దెవాడైన విషధరం దగ్గిరికేవచ్చి,

సుభ—(చిరునవ్వుతో) అయితే చూడండీ! మీారు తొమ్మిదినెల్ల కిందట ఏదో రాశార్ట. ఆపత్రిక ఓమాటు ఇల్లా యివ్వండి, వేరేపనుంది.

వి—తమకు ఏనెలది కావాలి? తొమ్మిది నెల్లూ, ముంతెడు నీళ్లూ అంటే ఏమిటి తెలిసేది?

సుభ—సరేలేవయ్యా, మహా! వెటకారంమాటలూ నువ్వూనూ!

అని యింట్లోకి దూకేసి, కుర్చీలో జార్లపడి కూచుని, ఆయన ఆ ఉత్తరం మళ్లీ గొణుక్కుని, తొమ్మిదినెల్ల సంగతి బోధచేసుగుని, మళ్లీ సత్వరున విషధరం దగ్గిరవాలి,

సుభ—ఈనెలపత్రిక ఇవ్వండి, పోనీ!

వి—చిత్తం. (అని లేచివెళ్లి పట్టుగొచ్చి, యిచ్చాడు.)

పత్రిక విషధరం చేతులోంచి లాక్కుని, సుభర్త తూటాలాగ నిష్క్రమించి, మళ్లీ వెనకటి కుర్చీమీాదే ఆనుకుని, కొన్ని పేజీలు ఇట్టే అని, ఒకవ్యాసంతీసి, అది తనమీాదే అనుకుని, ఆవ్యాసంలో భార్యాభర్తలకి ఉన్న పేర్లు తనికీ తనభార్యకీ అనుకుని, అందులో మరొకపేరు వ్యాసకర్తదే అనుకుని నిర్ఘాంతపోయి, "నా మీాదే సర్రోయ్!" అని ఒక్క రావణా కేకేసి వెనక్కి ఘూర్ణిల్లిపోయాడు. "చిలకా గోరింకల్లాంటి వాళ్లకి ఎంతొచ్చిందండీ! రామచంద్ర!" అంటూ సుభార్యగారొచ్చి, "ఫరవాలేదు లెండి. లేవండి. ఎవరివల్ల అబద్ధం ఉంటే వార్నే కొడుతుంది. ఆకుంక తక్కినవాళ్ల మర్యాదలుమాత్రం ఉంచాడనా మీా ఊహ? చిగురంటా చూడండి" అంది. సుభర్త, "ఆరి, లుచ్ఛా!" అంటూ నిమ్మణంగాలేచి, "మా అమ్మని పిల్వవమ్మా!" అన్నాడు పిలవకుండానే, సుబామ్మ వచ్చింది. ఆవిణ్ణిచూసి, "నాకూ నాభార్యకీ ఇద్దరికీ చెరో రాక్షసప్పేరూపెట్టి, తను మంచిపే రెట్టుగుని, మమ్మన్ని విషధరం ఏకేశా డమ్మోయ్!" అంటూ సుభర్త దీర్ఘాలు తీశాడు.

సుబా—అయ్యో! అయ్యో! వీడికేంవచ్చిందర్రోయ్! (అని యేడ్చి, ఏడుపు ఆపుగుని) ఓ చాపపట్రా కోడలా! (అని, చాప వేసింతరవాత) చాపమీద కుదిమట్టంగా కూచుని, హైరానలేకుండా ఏడవరా నాయ్నా!

అన్నతరవాత, అంతా చాపమీద సర్దుకొని గోల మొదలెట్టారు. స్వాములారు కాఫీ చల్లారపోస్తూనే ఉన్నాడు

సుభ—అమ్మా! నీమీందా రాసినట్టేనమ్మోయ్! నువ్వు రాకుసితల్లివిగా మరీ!

సుబా—నామీందా! ఓరి వీడిమొహం పొక్కా! నేనేంజేశా్రనా ముసిలిపీనుగునీ! వీడి ప్రజ్ఞ తగలేసిరిగదరా, వీడిప్రజ్ఞ తగ లెయ్యా! తనూ, పిల్లలు గలవాడుగదా, ఇంటిగుట్టు తనకెందుకమ్మా, అడిగేవాళ్లు లేకగానీ!

సుభ—(కొంచెం సమాళించుగుని) ఎదో పరికు తగులడ్డాడుకదా! ఉన్నఊళ్లో మెతుకు ల్లేక, పొట్ట చేత్తోబట్టుగుని, బస్తీకి యెగడి వచ్చాడు. లేనివాణ్ణి రక్షించడమే రక్షించడం. శరణాగతరక్షణానికి మనం పేరుపడి ఉన్నాం. ఈవ్యక్తి తలదాచుకుంటానని నాయింటో జాగా అడుగుతున్నాడు, గయుడికి మల్లే. పోనీగదా, అని చెప్పి వీణ్ణి నేను జేరదీస్తినిగదా, చివరికి వీడు నాకే పంగనామాలు పెడుతున్నాడే! తెగతిని, తిన్న యింటికి వాసాలు లెక్కట్టి, ఊడగొట్టి- పట్టుకుపోయే బాపతు! సంకరజాతిఖండాలుడు, తల్లీ తోడూ లేదు.

స్వా—ఆయన మీయింటో ఊరికేటండీ ఉంటా? ఊరికేజేరి ఇదోటా!

సుభ—అబ్బే! అద్దెకే!

స్వా—అంతేగద! అద్దెకి సున్నా చుడుతూంటాడా ఏమిటి?

సుభా—ఏమాటకామాటే అనాలి. అద్దె తిన్నగానే యిచ్చేసేసేస్తారండి. అయితే మాత్రం, నాకు రాకుసప్పేరు పెడతాడా? ఇదా వీడిమర్యాదా! (అని మళ్లీ మొదణ్ణించీ రాగాలెడుంది).

స్వా—ఆ రాత మీామీాదే అని ఋజువు లేందేటండీ?

సుబామ్మ — నిక్షేపరాయుళ్లలాంటి వాళ్లకి రాకుసప్పేర్లు అంటించేసిన తరవాత ఇహనేముందయ్యా! నువ్వూ నాకు మల్లేనే చాదస్తపుఘటంలా ఉన్నావ్!

సుభ—ఊరుకోండి, స్వామీ! స్పష్టంగా తెలుస్తూంటేనే!

ఇల్లా గోలచెయ్యడం నించి వీథంటపోయే వాళ్లు లోపలికి నస్తూండడంవల్ల చిన్న తీర్థం ఏర్పాటైంది. స్వాములారు అప్పుడప్పుడు ఊదుకుంటూ కాస్తకాస్తే కాఫీ కతుకుతూ కుర్చీలోనే కూర్చున్నాడు. విపధరం, సంగతి చూవత్తూ వింటూ తనవాటాలోనే గదిలో ఉన్నాడు. సుభర్తలేచి, జనాన్ని ఎల్లానో పాయ చేసుగుని, వీథులోకి వెళ్లడానికి దారి నిర్మాణం చేసి స్వాములారితో,

సుభ—స్వాములారూ! ఇంకా చూస్తావేం?

స్వా—కళ్లుండబట్టి, నాయ్నా!

సుభ—అది కాదోయ్! నువ్వు కాఫీస్వాము గారవని విషధరం నిన్ను పేపర్లో ఝూడిం చేశాడు. నువ్వు మాక్కుమల్లే ఇదవాలి, వాణ్ణి ఏదో శాస్త్ర గదమాయించాలి. ఇల్లా ఊరికే కాఫీ పీలుస్తూకూచుంటే ఏమయినట్టూ! నువ్వు బొత్తిగా కంగారుపడుతూన్నట్టు లేదే?

స్వా—ఎక్కడో ఓపంక్తి నీ కనవ్వయిస్తే, రాసి ఉన్న దంతా నీమీాదే అనుకుని నువ్వు ఏడుస్తూ, కడంవాళ్లని కుడా ఏడవమనా, నాయ్నా! (అని కాఫీ తాగుతాడు)

సుభ—అల్లాయితే, నేను విషధరందగ్గిరి కెళ్లి వాణ్ని నాలుగూ అడగాలి, నువ్వు కుడా వస్తావా రావా?

స్వా—కాఫీ తాగనీండి, నాయ్నా, మీారిచ్చిందేగా!

సుభ—అల్లాయితే, ఏడు!

అని సుభద్రఒక్కడూ విషధరం దగ్గిరికి వెళ్లపోతూంటే, ఇంటిఎదట పోగుపడ్డ జనంలో ఇద్దరు కొట్టుగుంటూండడం గమనించి, ఆగిపోయాడు. వాళ్లిద్దర్లో ఒకడు పింఛను ఇనస్పెక్టరు; రెండోవాడు ఉద్యోగంచేస్తూన్న ఇనస్పెక్టరు.

పింఛనువాడు—ఆ రాత నామీాదే!

కడంవాడు—ఛీ! నామీాదే! మనోవర్తి వాడవ్; నీలో ఏముంది రాయడానికి!

పిం—అందులో తాగుడువిషయం లేదు గనక, ఆ రాత నన్నుగురించే!

కడం—స్త్రీవ్యసనం గురించి ఉందిగనక అక్షరాలా నామీాదే! నీమీాద ఎల్లాఅవుతుంది, నీశార్థం!

పిం—లంచాల మాట ఉందిగనక, నామీాదే!

కడం—చిల్లరబాకీలు సంగతి లేదుగనక నామీాదే!

పిం—అవతతవకగా ఉందిగనక అచ్చంగా నామీాదే!

ఈదెబ్బలాట చూసేసరికి సుభద్ర కొంత విచారం తగ్గి, స్వాములారితో,

సుభ—చూశావా, స్వాములారూ! నువ్వు ఇంకా దొడ్డిదార్నే ఉన్నావ్! వాళ్లు ఏంతో సూక్ష్మబుద్ధి ప్రయోగించి తమసంగతి ఎక్కడెక్కడ రాసిఉందో అల్లా కనిపెట్టుగుంటూంటే, నీ కామాత్రం బుద్ధే లేదే!

స్వా—నోరు కట్టేయ్ నాయ్నా, నోరు కట్టేయ్! నువ్వు ఏంమాట్లాడు తున్నావో నువ్వెరగవ్! (అని కాఫీ తాగుతాడు.)

సుభ—(జనంకేసి తిరిగి, అవతలకి నడుస్తూ) అల్లాయితే పోనీ మీారంతా రండయ్యా! వాడి దగ్గిరి కెళ్లి ఈసంగతి కనుక్కుందాం!

అని విషధరం వాటాలోకి నడిచాడు. జనం కుడా అక్కడికి కదిలారు.

సుభ—ఏమయ్యోయ్! విషధరంగారు! మీాకు మాగృహం నచ్చకపోతే ఖాళీ చెయ్యండి. అంతేగాని, మావాటా బాగు

లేదని అక్కడా అక్కడా అనడం ఏంగొప్పనీ! మీ రిచ్చే అద్దెడబ్బులికి, నేను ఎక్కడలేని హంగులూ చేస్తూ కూర్చోలేను.

వి—మీమాటా నాకు నచ్చింది. దీన్ని గురించి యాగీ నేను ఎక్కడా చెయ్యలేదు. నాకు హంగులు అవసరం లేదు.

సుభ—ఎమో; ఉన్న సంగతదీ!

వి—ఎదీ? సమాధానం చెప్పండీ! ఇంత మందిని ఎందుకూ పిల్చుగొచ్చారు?

సుభ—నువ్వు నామీద రాతలు రాయ గలవ్, రాతున ప్పేల్లెట్టీ?

(అని చేతు లాడిస్తూ విషధరంమీదకి వెడతాడు.)

వి—నీమీద ఎవరయ్యా రాసిందీ!

సుభ—నువ్వే! నువ్వెప్పుడు రాసినా ఎవడిమీదో దెబ్బ!

వి—నీమీద, నే రాశానా? ఏం గర్వంగా ఉంది నీపనీ! నువ్వు మహారాజువనా, గొప్ప లక్షణాలు నీలో ముద్దకట్టిపోయి ఉన్నాయనా, నువ్వు ఆదర్శప్రాయుడవనా, పోనీ, నువ్వే మన్నా రౌండుటేబిల్ కాన్ఫరెన్సుకి వెళ్లి వచ్చావనా?

సుభ—ఓ కాఫీహోటల్లో గుండ్రటిబల్ల దగ్గిర కొంతమంది ఎరగనివాళ్లతో చేరి కాఫీ తాగొచ్చాను.

వి—రాసిందంతా నిన్ను గురించే?

సుభ—ఓ.

వి—అదంతా నిజమే?

సుభ—ఓ.

వి—అయితే నీకు కోపం ఎందుకూ?

సుభ—నిజం అంటే, అదంతా నిజమూ కాదు. కొంత అబద్ధం.

వి—అబద్ధం అయితే అసలు నీ కెందుకూ?

సుభ—ఇంకా వాదిస్తా వేమిట్రా నా తోటీ, కొంతనిజం, కొంతఅబద్ధం గుచ్చెత్తి నా మీద రాసీ?

ఈసమయానికి స్వాములారు కాఫీ పూర్తిచేసి వచ్చి,

స్వా—ప్రపంచకపురీతే అంత, నాయనా, ఆయన్ని ఏంజెయ్యమన్నావ్!

సుభ—నిజం అయితేమాత్రం వీ డెవ డయ్యా, నా సంగతి రాయడానికీ! నిజమైన సంగతులు బోలెడు మనం కప్పెట్టుగోడం లేదూ?

స్వా—అవును, నాయనా. నిజంఅయినా సరే, అసభ్యం అయితే మాట్టాడకూడదు, నా కేం అని మాట్టాడితే ఛీఛీప్రయోగంచేస్తారు. నిజం అయినాసరే రాజకీయరీత్యా బేశాసనం అయితే మాట్టాడనియ్యరట. నాకేం అని మాట్టాడితే లాటీప్రయోగం చేస్తారు.

సుభ—సరే, ఆహారించారుగాని మీరు వాక్కండి, వాక్కాయి లాగ. ప్రతీ సన్యాసి పీనుగూ నాయింటో మెయ్యడమూనూ, శత్రు

పక్షం వాదించడమూ ఖా, నాలో బోలెడు మంచిలక్షణాలు ఉంటూంటే అవి తీసుగు రాయ కూడదు వీడూ? నన్ను వచ్చి అడిగితే నే చెప్పనూ?

వి—తమయొక్క మంచిలక్షణాలు తమరి నోటంటగాని జనానికి తెలియడంలేదు. సరే, ఇది మీ మొదటి మంచిలక్షణం కావును.

సుభ—లోట్లు పట్టుకు ఏడుస్తావేం నాకుళ్లు మీద ఈగవాలినట్టూ! పాకీపని చెయ్యడం అను కున్నావురా, రాయడం అంటేనూ!

వి—చిత్తం. అంతటి అదృష్టంపడితే జన్మ తరించినట్టే అని మహాత్ములు చెప్పలేదూ?

సుభ—నన్నేడిపించి నువ్వు నవ్వుకోడ మూ నీ ప్రజ్ఞ?

వి—స్వతస్సిద్ధం, శారీరకం అయినలోట్లు చూస్తే జాలి. స్వార్జితం, మానసికం అయిన లోట్లు చూస్తే సరదా.

సుభ—ఇహ నామీద రాశావంటే, జాగ్రత్త.

వి—నీమీద ఎన్నడూ రాయను, మను ష్యులమీద రాస్తాను.

సుభ—అసలు నాకు కోపం వచ్చిం దంటే, మనిషినిగాను.

వి—కోపం రానప్పుడూ అంతేలా కన పడుతున్నారు. పోనీ, కీర్తినష్టానికి దావా తెచ్చు కోండి! (అని దగ్గిరికెళ్లి గట్టిగా అంటాడు.)

స్వా—ముందు మాట, కీర్తి ఉన్నతరవా తేగా, నష్టం రావడానికీ!

సుభ—ఒరేయి, స్వాములారూ! నువ్వు లేచిపో! నాగడప తొక్కకు!

స్వా—చిత్తం. హాశిష్యా! తత్వం నీలో జీర్ణించిందిగా! సెలవు.

(అని వెళ్లిపోతాడు.)

సుభ—ఒరేయ్! విషం! మీదమీది కొస్తా వురా! పొగరుపోతురకం! నన్ను కొట్టబోతా వుట్రా! పైగా నన్ను డిఫర్మేషన్ తెమ్మంగో మాటావురా, భడవా! అయితే నాయిల్లుఖాళీ చెయ్యి! తక్షణం! ఈ ఊళ్లో నీకు ఇల్లు ఎవడి స్తాడో చూస్తాను!

వి—చిత్తం.

విషధరం ఆయిల్లు తక్షణం ఖాళీచేశాడు. అతనికి ఇంకోయిల్లు ఇప్పించినాయన్ని చూస్తే కుడా సుభద్రకి కోపం. లోగడ సుభద్ర విష ధరం దగ్గిరకూచుని, "మీదగ్గిర చాలా 'విట్టీ' ఉందండీ!" అని స్తోత్రాలు చేసేవాడు. ఇప్పుడు అతను రాసింది విమర్శించుతూంటాడు. సహ జం! అతడు ఒకనాడు గ్రంథవిమర్శ చేస్తూ (చాలా మూలం తెలియకుండా కసి వెళ్లబుచ్చుకుని తద్వారా ఒకవిధమైన ఔన్న త్యం సంపాదించాలని కొందరు విమర్శకులు సంపాదించే పడికట్టు విమర్శకుప్పెలు సుభద్ర కుడా కొన్ని జాగ్రత్త చేశాడు!) ఒకప్రదర్శన గ్రంథంలో "త్రాణా, రసం లేందే!" అని తీర్మానించాడు. (విమర్శ ప్రపంచంలో అతని తీర్మానం వినేవాళ్లులేరు మరి; ఎన్నింటికని ఇదవం.") మర్నాడు, ఆగ్రంథం రాసింది విష

ధరం పేరింటిగాడైన మరొకాయన అని తెలిసి, ఆయనదగ్గిరికి వెళ్లి, "అయ్యా! ఆ గ్రంథం మీదే అని తోఁగడ ఎరగను. వాడి దనుకున్నాను. మీదని తెలిస్తే నేను దాన్ని మెచ్చుకునే ఉందును" అని సెలవిచ్చాడు. సుభర్త ఇల్లాగ్గా తనప్రజ్ఞ వాడుతున్నాడు. సుపుత్రుడు రాయదల్చిన సమాధానం తయారు కాలేదు. తక్కిన అంతా క్షేమం. స్వాములారు మరోచోట కాఫీ తాఁగుతూనే ఉన్నాడు.

ఈముక్కలు నోటుగా చదువుకుని, ఇది మళ్లీ "నామీదేనప్రోయ్!" అని ఘూర్ణిల్లే సుభర్తలుగనక ఎవరేనా ఉంటే ఉండవచ్చు. వారు లేచింతరవాత, వారికి నమోన్నమః.

కో కి ల*

సెట్టి లక్ష్మీనరసింహముగారు B. A.

పరమసుఖభరితమ్ము, యో పరభృతమ్మ-మరల వచ్చిన నిను వింటి మురియుచుంటిఁ;
గోకిలా పిట్టవందునో లేక తిరుగు లాడు-కేవలధ్వనివని యందునో నిను ?

కుహూకుహూ యని రెట్టింపుకొన్న నీదు-కేక వనముల వినఁబడె నాకుఁ గొండ
నుండి కొండకుఁ బోయినట్లుండె నొక్క-తఱినె యయ్యది దవ్వును దాపు నగుచు.

క్రొన్ననలఁ గూర్చి పండ్లను గూర్చి వనుల-తోడ నచ్చికబుచ్చికలాడుకొలఁకె
వచ్చియును జిన్ననాఁటి నా ముచ్చటులను-జ్ఞప్తికిం దెచ్చుచుంటివి నాకు నీవు.

ఆమనికిఁ గడుఁ బ్రేమ గలట్టి చుట్ట-మా పికమ స్వాగతమ్ము మమ్మాటి కిపుడు;
నాకు నేఁటికిం బిట్టవుగాక కనుల-కగపడనిదానవు ధ్వని వత్యద్భుతమవు.

చిన్ననాఁటఁ దోఁటల నేను విన్నయట్టి-దానవే యాదువుగద యాధ్వని నను మును
వేయి దెసలను గనునట్లు చేయుచుండెఁ-బొదలయందు వృక్షములందుఁ జదలునందు.

నిన్నుఁ గనుఁగొను నాశతో నేఁ బలుమఱు-నడవులం దోఁటలం దిరుగాడినాఁడ;
నేను వాంఛించుచేట తప్ప నెప్పటికిని-దొరక కాశవై ప్రేమవై పరఁగితీవు!

ఇప్పటికి నీదు పాట నా కిష్టమె యిల-పైని వెలికిలం బన్నుండి దాని విందుఁ
గడచి చనిన యట్టి యుల బంగారు వంటి-వయసు క్రమ్మఱ వచ్చినట్లయినవఱకు.

మేము మెలఁగుచు నున్న యీ భూమి యపుడు-నీవు నివసింపఁ దగినట్టి దేవతాప్ర
దేశమై మిథ్య మైనరీతిగను మగుడఁ-గనఁబడును ధన్యజన్మంబు గలుగు పులుఁగ!

---

* Wordsworth's 'To the Cuckoo.'